ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు





దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం



రాట ముహూర్తం నిర్వహిస్తున్న దృశ్యం

ద్రాక్షారామ, సెప్టెంబరు 20: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో అక్టోబరు 3 నుంచి 12 వరకు జరుగనున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లకు శుక్రవారం రాట ముహూర్తం చేశారు. ఉదయం 9.31 గంటలకు ఆలయ అర్చకులు, వేదపండితుల బృందం పూజలు చేసి రాట ముహూర్తం చేశారు. ద్వాదశశక్తి పీఠంగా పూజలు అందుకుంటున్న మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుతామని ఆలయ సహాయ కమిషనర్ అల్లు భవానీ తెలిపారు.

పోలీస్, పబ్లిక్ మధ్య సత్సంబంధాలు ఉండాలి

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

కొత్తపేట, సెప్టెంబరు 20: పోలీస్ పబ్లిక్ మధ్య మంచి రిలేషన్ కలిగి ఉండడం ద్వారా నేరాలు అదుపునకు కృషి చేయాలని ఏలూరు రేంజ్ ఐజీ గోరంట్ల వెంకటగిరి అశోక్‌కుమార్ చెప్పారు. సాధారణ తనిఖీలలో భాగంగా కొత్తపేట పోలీస్‌స్టేషన్‌కు శుక్రవారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఈవ్‌టీజింగ్, ఉమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అలాగే శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పటిష్టమైన చర్యలు చేపట్టాలని, అలాగే ట్రాఫిక్ నియంత్రణ పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని, ఫ్యామిలీ కౌన్సిలింగ్‌ను నిర్వహించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, రావులపాలెం టౌన్ సీఐ జేమ్స్‌రత్నప్రసాద్, ఎస్ఐ జి.సురేంద్ర తదితరులు ఉన్నారు.

నరకయాతన నుంచి విముక్తి కల్పించండి

ఖతర్ నుంచి మహిళ సెల్ఫీ వీడియో



రాయవరం, సెప్టెంబరు 20: పొట్ట చేతపట్టుకుని ఉపాధి కోసం గల్ఫ్ దేశమైన ఖతర్ వెళ్లిన మహిళ అక్కడ పడుతున్న బాధలను వివరిస్తూ ఓ సెల్ఫీ వీడియో విడుదల చేసింది. నరకయాతన పెడుతున్నారని, తనను స్వదేశానికి రప్పించాలని వేడుకుంటూ కన్నీటిపర్యంతమయ్యింది. పనికి కుదుర్చుకున్న యజమాని చిత్రహింసలకు గురి చేస్తోందని, ఆమె బారినుంచి తనను కాపాడి స్వదేశానికి తీసుకురావాలంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌ను వేడుకుంటూ పంపిచిన సెల్ఫీ వీడియో శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం గ్రామానికి చెందిన వివాహిత సారథి దేవి హేమలత 2023 నవంబర్ నెలలో ఒక మధ్యవర్తి ద్వారా ఉపాధికోసం గల్ఫ్ దేశమైన ఖతర్ వెళ్లింది. నెలకు 25 వేల రూపాయలు జీతానికి పనికి కుదిరింది. అయితే యజమానురాలు తనతో పగలు, రాత్రి తేడా లేకుండా వెట్టి చాకిరీ చేయిస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. గుండె నొప్పిగా ఉందని చెప్పిన ఆసుపత్రిలో చూపించకుండా మందులు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతోందని ఆవేదన వ్యక్తం చేసింది. స్వదేశానికి వెళ్లాలంటే 2.5 లక్షలు కట్టాలని షరతు విధించారని చెబుతుంది. డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్, జిల్లాకు చెందిన మంత్రి వాసంశెట్టి సుభాష్ తనను తిరిగి స్వదేశానికి తీసుకువచ్చేందుకు చొరవ చూపాలని కోరింది. దీనిపై రాయవరం ఎస్ఐ బుజ్జిబాబును వివరణ కోరగా బాధితురాలి వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు.

ఉద్యోగులకు హెల్మెట్ తప్పనిసరి



కాకినాడ సిటీ, సెప్టెంబరు 20: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ద్విచక్ర వాహనాలపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ఉద్యోగులు, సిబ్బంది హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని, లేకపోతే కార్యా లయంలోకి అనుమతి లేదని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ శుక్రవారం ప్రకటించారు. ఉమ్మడి జిల్లా నోడల్ కలెక్టర్‌గా ఆయన ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాతో పాటు రంపచోడవరం నియోజకవర్గానికి కూడా వర్తించనున్నాయి.

గ్యాస్ పైప్‌లైన్ లీకేజీ

గోదావరిలో సుడులు తిరుగుతుండడంతో భయాందోళన

ప్రమాదం లేదని అధికారుల నిర్ధారణ

యానాం, సెప్టెంబరు 20: యానాం శివారు దరియాలతిప్ప సొసైటీ భూములను ఆనుకుని గోదావరి నుంచి వెళుతున్న గ్యాస్ పైప్‌లైన్ లీకేజీ అయ్యిందనే సమాచారంతో అంతా ఆందోళన చెందారు. లీకేజ్ అయినచోట నీరు సుడులు తిరుగుతోంది. సమాచారం తెలుసుకున్న యానాం కాంగ్రెస్ అధ్యక్షుడు అర్జాని సురేష్ పడవపై వెళ్లారు. ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకుండా చమురు సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగం స్పందించాలని డిమాండ్ చేశారు. యానాం పరిపాలనాధికారి మునుస్వామి ఆ ప్రాంతానికి వెళ్లి చమురు సంస్థల ప్రతినిధులతో మాట్లాడగా వాటివల్ల ఎటువంటి ప్రమాదం ఉండదని నీటిలో ఇటువంటివి వస్తూ ఉంటాయని చెప్పినట్లు తెలుస్తోంది.



ప్రసాదంలోనూ.. గే..కుడేనా!?

కిలో నెయ్యి అన్నవరంలో రూ.538.. సింహాచలంలో కిలో రూ.344

తిరుపతి దేవస్థానానికి సరఫరా అవుతున్న నెయ్యిలో చేప నూనె, జంతు కొవ్వు అవశేషాలు బయటపడి సంచలనం సృష్టిస్తోంది.. తిరుపతి ప్రసాదాన్ని భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారు.. అటువంటిది అక్కడే కల్తీ జరిగిందంటే మిగిలిన ఆలయాల మాటేంటి ఇదీ ప్రతీ భక్తుడిని తొలుస్తున్న ప్రశ్న మన జిల్లాలో అన్నవరం ప్రసాదానికి మహా డిమాండ్.. ప్రతి ఏటా లక్షలాది కిలోల నెయ్యి వినియోగిస్తారు. అటువంటిది అన్నవరం ఆలయానికి సరఫరా అవుతోన్న నెయ్యిపై 'ఆంధ్రజ్యోతి' ఆరా తీసింది. దీంతో ఈ నెయ్యి బండారం బయటపడింది. ఒకే కంపెనీ అన్నవరం దేవస్థానానికి.. సింహాచలం దేవస్థానానికి నెయ్యి సరఫరా చేస్తోంది.. అన్నవరంలో కిలో నెయ్యికి రూ.538 వసూలు చేస్తుంటే.. అదే కంపెనీ సింహాచలంలో మాత్రం కిలో రూ.344 వసూలుచేయడం గమనార్హం. నేతలు, అధికారుల అండదండలతో కాంట్రాక్టరు గీకుడుకి అడ్డు లేకుండాపోయింది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అన్నవరం దేవస్థానానికి సరఫరా అవుతోన్న లక్షల కిలోల నెయ్యి మంచిదేనా..? లక్షలాది మంది భక్తులు ఇష్టంగా తినే ప్రసాదంలో పూర్తిగా నెయ్యి నాణ్యత పాటిస్తున్నారా..? ఆలయానికి సరఫరా అవుతోన్న నెయ్యి గడచిన రెండేళ్లుగా ఒకే కంపెనీ నుంచే ఎందుకు వస్తోంది.. ఆరునెలలకోసారి టెండర్లు పిలుస్తుండగా.. ప్రతిసారీ అదే కంపెనీకి కాంట్రాక్టు ఎలా దక్కుతోంది.. అదే కంపెనీ సింహాచలం దేవస్థానానికి కిలో నెయ్యి రూ.344కి సరఫరా చేస్తుంటే అన్నవరంలో మాత్రం కిలో రూ.538 ఎలా వసూలు చేస్తోంది. ఏటా దేవస్థానానికి 1.80 లక్షల కిలోల నెయ్యి అవసరమైతే అంత భారీ నెయ్యి ఒక డీలర్ ఎలా సరఫరా చేయగలుగుతున్నాడు. మార్కెట్లో లభ్యమయ్యే నాణ్యమైన నెయ్యి ధరకు.. దేవస్థానానికి సరఫరా చేసే ధరకు ఇంత వ్యత్యాసం ఉంటే.. మరి ఆలయానికి వచ్చే నెయ్యిలో అంత నాణ్యత ఉంటుందా? ఇలా ఎన్నో సందేహాలు భక్తుల నుంచి ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి.

నాణ్యతపై అనుమానాలెన్నో...

వాస్తవానికి స్వచ్ఛమైన నాణ్యతతో కూడిన కిలో ఆవు నెయ్యి రూ.వెయ్యి వరకు పలుకుతోంది. ఆలయాలకు మాత్రం కాంట్రాక్టర్లు సగం ధరకే సరఫరా చేస్తుండడంతో నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. లక్షల కిలోల్లో సరఫరా కాబట్టి కాస్త బల్క్‌గా ధర తగ్గిందనుకున్నా ఏదో పేరొందిన డెయిరీలు మాత్రమే ఆ స్థాయిలో నెయ్యి సరఫరా చేయగలవు. అయితే వైసీపీ వచ్చిన తర్వాత వరుసగా రెండేళ్లపాటు ఒకే కంపెనీ నెయ్యి సరఫరా చేస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కంపెనీ తరపున ఓ డీలరు ఇంత భారీ నెయ్యిని ఎలా సరఫరా చేస్తున్నాడనే దానిపై అనుమానాలున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే రోజుకు దాదాపు 496 కిలోల నెయ్యి ఆలయానికి సరఫరా చేయడం అసాధ్యం. పైగా ఒక కిలో ఆవు నెయ్యి తయారవ్వాలంటే సరాసరి 30 లీటర్లకుపైగా పాలు అవసరం. మరి ఈ స్థాయిలో నెయ్యి తయారు చేసి సరఫరా చేయడం సాధారణ కాంట్రాక్టర్‌కు సాధ్యం కాదు. వేర్వేరు ప్రాంతాల నుంచి సేకరించి మిక్స్ చేసే అవకాశాలున్నాయి. దేవస్థానం ఈ నెయ్యి నాణ్యతను ఎంత వరకు సమర్థవంతంగా పరీక్షిస్తుందనేదానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పటికప్పుడు నెయ్యి నాణ్యతను పరీక్షించాల్సి ఉండగా, వైసీపీ పెద్దల సిఫారసు చేసిన కాంట్రాక్టరు కావడంతో అధికారులు ఇదేదీ పెద్దగా పట్టించుకోవడం లేదు. తాజాగా తిరుపతి దేవస్థానానికి సరఫరా అయిన నెయ్యి వివాదాస్పదమైన నేపథ్యంలో ఇక్కడకు సరఫరా అవుతోన్న నెయ్యిపై ఇక నుంచి మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- ఒకే కంపెనీ. ధరలో మాత్రం భారీ వ్యత్యాసం
- అన్నవరం దేవస్థానంలో నెయ్యి మాయాజాలం
- రెండేళ్లుగా ఒకే కంపెనీ నుంచి నెయ్యి కొనుగోలు
- నాలుగు సార్లు టెండర్లు.. ఒకే కంపెనీకి కాంట్రాక్టు
- గతంలో విజయ డెయిరీ నుంచి కొనుగోలు
- వైసీపీలో అనామక కంపెనీ నుంచే సరఫరా
- ఏటా 1.80 లక్షల కిలోల నెయ్యి అవసరం
- రెండేళ్లలో రూ.7.76 కోట్ల నొక్కుడు

2 కోట్ల ప్యాకెట్లు అమ్మకం..

అన్నవరం దేవస్థానం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రం. ఏటా లక్షలాది మంది భక్తులు ఆలయానికి వస్తుంటారు. ఇక్కడకు వచ్చే ప్రతి భక్తుడు ఎంతో ఇష్టంగా అన్నవరం ప్రసాదాన్ని తింటారు. ఏటా రెండు కోట్ల వరకు ప్రసాదం ప్యాకెట్లు అమ్ముడవుతాయి. ఈ ప్రసాదం తయారీలో నెయ్యి కీలకమైనది. దీని నాణ్యతపైనే ప్రసాదం రుచి ఆధారపడి ఉంటుంది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒకే కంపెనీ గడచిన రెండేళ్లుగా నెయ్యి సరఫరా చేస్తోంది. ఈ నెయ్యి ధరపై అనేక అనుమానాలు ఉన్నాయి.

రెండేళ్లు..4 టెండర్లు.. ఒకరికే..

అన్నవరం ఆలయానికి ఏటా 1.80 లక్షల నుంచి రెండు లక్షల కిలోల వరకు నెయ్యి అవసరం. ఈ నెయ్యి కొనుగోలు కోసం దేవస్థానం సెంట్రల్ స్టోర్స్ విభాగం ప్రతి ఆరు నెలలకోసారి టెండర్లు పిలుస్తుంది. ఎవరు తక్కువ ధర కోట్ చేస్తే వారికే అప్పగిస్తుంది. 2022 అక్టోబరు నుంచి ఇప్పటి వరకు నాలుగు సార్లు టెండర్లు పిలవగా వరుసగా ఒకే కంపెనీ పేరుతో టెండర్‌లో పాల్గొంటున్న ఓ డీలర్‌కే ఈ కాంట్రాక్టు దక్కుతుండడం అనుమానాలకు తావిస్తోంది. సదరు కాంట్రాక్టర్ కోట్ చేసిన ధర ఇతర ఆలయాలకంటే ఎక్కువగా ఉన్నా అధికారులు ఇదేదీ పట్టించుకోలేదు. ఈమేరకు అధికారంలో ఉన్న సమయంలో కొందరు వైసీపీ పెద్దలు పావులు కదపడం విశేషం. గడచిన రెండేళ్లుగా సదరు డీలరు దేవస్థానానికి కిలో నెయ్యి 2022 అక్టోబరు నుంచి 2023 మార్చి వరకు కిలో రూ.498 చొప్పున, 2023 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు కిలో రూ.564 చొప్పున, 2023 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు రూ.540, 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు రూ.538.60 చొప్పున సరఫరా చేస్తున్నాడు. సింహాచలం దేవ స్థానానికి మాత్రం ఇదే కంపెనీ కిలో నెయ్యి రూ.344 చొప్పున సరఫరా చేస్తోంది. దీన్నిబట్టి అన్నవరం ఆలయానికి సరఫరా చేసే నెయ్యి ధరలో ఎంత పిండేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ ధరతో పోల్చితే ఈ రెండేళ్లలో దేవస్థానానికి రూ.7.76 కోట్లు నష్టం వాటిల్లినట్టు లెక్క. తిరుపతిలాంటి దేవస్థానానికి కిలో నెయ్యి రూ.411కి సరఫరా కాగా ఇక్కడ మాత్రం ధరలో వ్యత్యాసం ఉండడం విశేషం. వాస్తవానికి జగన్ సర్కారు రాక ముందు అన్నవరం దేవ స్థానానికి సంగం, విజయలాంటి పేరొందిన డెయిరీల నుంచి నెయ్యి వచ్చేది. కమీషన్ల కక్కుర్తితో వైసీపీ 2022 నుంచీ ఊరు పేరు లేని కంపెనీని తెరపైకి తెచ్చి నెయ్యి సరఫరా చేయిస్తుండడం విశేషం.

100 రోజుల పాలనపై ప్రజల్లోకి..

'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు



ద్రాక్షారామ: మాట్లాడుతున్న మంత్రి సుభాష్



అయినవిల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి



ముమ్మిడివరం: కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

మరిన్ని వార్తలు 8లో..



ఉప్పలగుప్తం: కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



మండపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల



రావులపాలెం: సభలో ఎమ్మెల్యే బందారు



అంతర్వేది: మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

ప్రజలు మెచ్చిన పాలన

100 రోజుల్లో ఎన్నో కార్యక్రమాలు అమలు చేశాం

'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి సుభాష్

ద్రాక్షారామ, సెప్టెంబరు 20: కూటమి ప్రభుత్వం తొలి వంద రోజుల్లో ప్రజలు మెచ్చిన పాలన అందించిందని మంత్రి సుభాష్ అన్నారు. రామచంద్రపురం మండలం చోడవరం, నరసాపురపేటలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. అధికారం చేపట్టగానే డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా సుమారు 16 వేల టీచర్ పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ఒకేసారి వెయ్యి రూపాయలు పెంచి పింఛన్ రూ.4 వేలు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తూ ల్యాండ్ టైటిల్ చట్టం రద్దు చేశామన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు ప్రారంభించామన్నారు. రూ.5కే భోజనం, టిఫిన్ సదుపాయం కల్పించినట్లు చెప్పారు. ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలు అందజేస్తున్నామన్నారు. తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్, మాజీ మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పితాని వీరభద్రరావు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, పెంకె సాంబశివరావు, మాజీ ఎంపీటీసీ విత్తనాల వెంకటరమణ, కొత్తపల్లి శ్రీను, మాజీ కౌన్సిలర్ దంగేటి గౌరీశంకర్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం

యథేచ్ఛగా సాగుతున్న దందా

అధికారులు దాడులు చేస్తున్నా 'డోంట్ కేర్'

తరచూ పట్టుబడుతున్న రేషన్ బియ్యం

నమోదవుతున్న కేసులు

అయినా ఆగని అక్రమ వ్యాపారం



రావులపాలెం హైవేపై సీజ్ చేసిన రేషన్ బియ్యం(ఫైల్)

రావులపాలెం, సెప్టెంబరు 20: రేషన్ బియ్యం కొందరు అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. జిల్లాలో రేషన్ బియ్యం దందా యథేచ్ఛగా కొనసాగిస్తూ కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని అధిక ధరలకు విక్రయించి కొందరు మాఫియా సభ్యులు సొమ్ములు చేసుకుంటున్నారు. ఇటీవల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని పలు మండలాలలో పట్టుబడిన అక్రమ రేషన్ బియ్యమే ఇందుకు నిదర్శనం. రావులపాలెం కేంద్రంగా రేషన్ బియ్యం దందా నిరంతరం కొనసాగుతోంది. ఈ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా రహస్య ప్రాంతాల్లో నిల్వ ఉంచి అనంతరం లారీలో లోడు చేసి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ములు చేసుకోవడం పరిపాటిగా మారింది. జిల్లాలో రేషన్ లబ్ధిదారులకు 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు రేషన్ బియ్యం అందిస్తున్నారు. 6వ తేదీ నుంచి మొదలు కొందరు చిల్లర వ్యాపారులు లబ్ధిదారుల వద్ద రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి మోటార్‌సైకిళ్లపై రహస్య స్థావరాలకు తరలించి సొమ్ములు చేసుకుంటున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో పాటు రావులపాలానికి సమీప మండలాల నుంచి కొందరు వ్యక్తులు మోటార్‌సైకిళ్లపై రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి రావులపాలెం తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. కాగా రావులపాలానికి చెందిన ఆ వ్యక్తి రేషన్ బియ్యం దందా నిర్వహిస్తూ పలు మార్లు పట్టుబడటం అధికారులు కేసులు నమోదు చేయడం షరా మామూలైంది. ఈ నెల 18వ తేదీన రేషన్ బియ్యం కొనుగోలు అక్రమ నిల్వలపై విజిలెన్స్ అధికారులు దాడి చేసి పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ రేషన్ బియ్యం అక్రమ దందాపై ప్రత్యేక నిఘా లేకపోవడంపై సమాచారం వస్తేనే దాడులు చేయడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారంటూ పలువురు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అట్రాసిటీ కేసులను సత్వరం పరిష్కరించాలి

అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్

అమలాపురం, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద నమోదైన కేసులను సత్వరమే పరిష్కరించి తగు న్యాయం చేసే విధంగా రెవెన్యూ, పోలీస్, న్యాయ వ్యవస్థలు కృషి చేయాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి పౌర హక్కుల రక్షణ ఎస్సీ, ఎస్టీ దురాగతాల నివారణ చట్టం అమలుపై ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల్లో 60 రోజుల్లో చార్జిషీట్లు దాఖలు చేయాలని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులలో కేసులు సత్వర పరిష్కారం కోసం ఎటువంటి జాప్యం జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. కేసుల సత్వర విచారణకు అవసరమైన ధ్రువపత్రాలను ఎప్పటికప్పుడు తహసీల్దార్లు జారీ చేయాలన్నారు. ఉపాధి, పరిహారం మంజూరు విషయంలో జాప్యం జరగకుండా తక్షణం అమలు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం నష్ట పరిహారాలు అందించాలన్నారు. ప్రేరేపిత కేసులతో చట్టం దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. అనంతరం పోలీస్ రెవెన్యూ అధికారులు డివిజన్ల వారీగా కేసులకు సంబంధించి వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏవీఆర్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ జ్యోతిలక్ష్మీదేవి, ఆర్డీవో జి.కేశవర్ధన్‌రెడ్డి, ఎస్.సుధాసాగర్, జీవీవీ సత్యనారాయణ, డీఎస్పీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దేవస్థానం భూముల్లో ఆక్రమణల తొలగింపు

కబ్జా కోరల్లో కోటిపల్లి దేవస్థానం భూములు

ఎట్టకేలకు రంగంలోకి దిగిన అధికారులు

ఆక్రమణల కూల్చివేత



ఆక్రమణలు కూల్చివేస్తున్న అధికారులు

కె.గంగవరం, సెప్టెంబరు 20: కోటిపల్లి శ్రీఛాయా సోమేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూముల్లో శుక్రవారం అధికారులు ఆక్రమణలు తొలగించారు. ఆలయం ఎదురుగా ఉన్న సోమగుండం చెరువును ఆనుకుని కొందరు ఆక్రమణలకు పాల్పడ్డారు. షెడ్లు, శాశ్వత నిర్మాణాలు చేశారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో దేవదాయ శాఖ అధికారులు ఆక్రమణదారులకు గతంలో నోటీసులు జారీ చేశారు. దీనిపై ఆక్రమణదారుల నుంచి ఏవిధమైన స్పందన లేకపోవడంతో ఏసీ మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ పర్యవేక్షణలో భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలు తొలగించారు. 5సెంట్లు స్థలాన్ని దేవస్థానం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తొలగింపు ప్రక్రియ చేపడుతున్న సమయంలో ఓలేటి లక్ష్మి తమ షెడ్డు కూల్చివేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తమకు నిలువ నీడ లేదని ఇదే ఆధారమని బోరున విలపించింది. అలాగే పోలీసులు ఆక్రమణలో ఉన్న అవుట్ పోస్టును స్వాధీనం చేసుకుని పోలీస్ అవుట్ పోస్టుగా బ్యానర్ ఏర్పాటు చేశారు. సీఐలు అశోక్‌కుమార్, దొరరాజు, జి.వెంకటేశ్వరరావు, పామర్రు ఎస్ఐ జానీ బాషా, దేవస్థానం ఈవో శ్రీదేవి, దేవదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.



నీలి మేఘం శ్రీఆంజనేయం

కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట బీచ్ వద్ద శుక్రవారం సాయంత్రం ఆకాశాన్ని నీలి మేఘాలు కమ్మేశాయి. ఆ మేఘాల ముందు అభయమిస్తున్నట్టుగా దర్శనమిచ్చారు ఆంజనేయస్వామి. ఈ దృశ్యం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది. - కాకినాడ

అన్నవరం దేవస్థానం రెగ్యులర్ ఈవోగా

రామచంద్రమోహన్

అన్నవరం, సెప్టెంబరు 20: అన్నవరం దేవస్థానం రెగ్యులర్ ఈవోగా కె.రామచంద్రమోహన్‌కు బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయ శాఖ కమిషనరు సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వర్క్ అరేంజ్‌మెంట్‌లో భాగంగా గతంలో చంద్రశేఖర్ ఆజాద్ అన్నవరం ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నట్టు రికార్డుల్లో పేర్కొన్నారు. అయితే ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఆజాద్‌ను రెండు రోజుల క్రితం చిత్తూరు ఆర్జేసీగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఖాళీ అయిన స్థానంలో ప్రస్తుతం అన్నవరం ఈవోగా ఉన్న రామచంద్రమోహన్ తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు రెగ్యులర్ ఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తారు.

కాకినాడ, కోనసీమ ఉమ్మడి జిల్లాల ఇంటెలిజెన్స్ డీఎస్పీగా

మురళీమోహన్ బాధ్యతల స్వీకారం



కాకినాడ క్రైం, సెప్టెంబరు 20: కాకినాడ, కోనసీమ ఉమ్మడి జిల్లాల ఇంటెలిజెన్స్ డీఎస్పీగా సుంకర మురళీమోహన్ కాకినాడ వైద్య నగర్‌లోని కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన ఏసీబీ సీఐగా పని చేశారు. అనంతరం కాకినాడ ఎస్బీ డీఎస్పీగా, దిశా డీఎస్పీగా పని చేశారు. తదుపరి పెద్దాపురం ఇన్‌చార్జి డీఎస్పీగా పనిచేసిన ఆయన ఎన్టీఆర్ జిల్లాకు బదిలీపై వెళ్లి తిరిగి కాకినాడ, కోనసీమ ఉమ్మడి జిల్లాల ఇంటెలిజెన్స్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన దుర్గారావు విజయవాడ పటమట డీఎస్పీగా బదిలీ అయ్యారు.



యువజనోత్సవాల్లో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

- మహిళలకు సముచిత స్థానం కల్పించాలి
- రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి
- నన్నయ విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన యువజనోత్సవాలు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 20: దేశాన్ని అభివృద్ధి పథంలో నడపడంలో యువత కీలక బాధ్యతలు స్వీకరించాలని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్ చెరువులోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కన్వెన్షన్‌లో రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ (సెట్రాజ్) ఆధ్వర్యంలో యువజనోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో యువశక్తి ఆస్తిగా ఉన్న దేశం భారత్ అన్నారు. నేడు ప్రపంచంలో ఆర్థిక శక్తిగా ఎదిగిన దేశాలు వృద్ధాప్య ఛాయలను కలిగి ఉండగా... భారతదేశం ఒక్కటే భవిష్యత్ అభివృద్ధికి కొలమానంగా ఉందన్నారు. దేశ జనాభాలో 50శాతం పైగా ఉన్న మహిళలను ప్రోత్సహించి వారికి సముచిత స్థానం కల్పించాల్సి ఉందని, కొంత మంది మహిళలు రక్తహీనత, ఎనీమియా, ఇతర అనారోగ్యాలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. విశిష్ట అతిథి, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ యువతలో మంచి నాయకత్వ లక్షణాలు ఉన్నప్పుడే విజయాలు సాధ్యమవుతాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విజ్ఞతతో సద్వినియోగం చేసుకోవడంతో పాటు దేశాభివృద్ధిలో వాటి ద్వారా ఒనగూరే ప్రయోజనాలను అందుబాటులోకి తీసుకుని రావడంలో యువత పాత్ర కీలకమన్నారు. దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, గోరంట్ల బుచ్చయ్య చౌదరి కోరారు. మన సంస్కృతీ, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడంలో ముఖ్య భూమిక వహించాలని కోరారు. యువజన సర్వీసుల శాఖ కమిషనరు పి.శారదాదేవి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో విజేతలకు రాష్ట్రస్థాయికి ఎంపిక వుతారన్నారు. అక్కడి నుంచి జాతీయ స్థాయికి పంపిస్తారన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో అతిథులు ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు, సెట్రాజ్ కాకినాడ సీఈవో కేఎస్‌వీ కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



యువజనోత్సవాల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి



శిక్షణ ఇస్తున్న పీడీజే సునీత

పారా లీగల్ వలంటీర్లకు

ప్రత్యేక శిక్షణ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో పారా లీగల్ వలంటీర్లకు రెండు రోజుల ప్రత్యేక శిక్షణ శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత మాట్లాడుతూ పారా లీగల్ వలంటీర్లుగా నియమితులైన వారికి న్యాయ సేవలు, వివిధ చట్టాలపై అవగాహన కల్పించడం ఈ శిక్షణ ఉద్దేశమన్నారు. ప్రజలకు, న్యాయ సేవాధికార సంస్థలకు పీఎల్‌వీలు వారధులుగా వ్యవహరించాలన్నారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.గాయత్రీదేవి, న్యాయవాది పి.శ్రీనివాసరావు, ఏసీఎల్‌లు ఎస్‌కే జబీన, ఎం.లలిత కుమారి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జె.మహేశ్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీఎం ప్రేమ్‌కుమార్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విలియం పలు చట్టాలు, అంశాలను వివరించారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



వెంకన్న (పాత చిత్రం)

అంబాజీపేట, సెప్టెంబరు 20: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ముక్కామల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెనుక చెల్లు వెంకన్న (56) నివాసం ఉంటున్నాడు. ఇక్కడ తాపీ పనులు సరిగ్గా లేకపోవడంతో రెండు వారాల క్రితం హైదరాబాద్‌లోని తన కుమార్తె ఇంటికి వెళ్లి వచ్చాడు. అప్పుల బాధలు ఎక్కువ కావడంతో తన సమీప బంధువునకు స్థలాన్ని విక్రయించాడు. అడ్వాన్సుగా కొంత మొత్తాన్ని తీసుకున్నాడు. ఈ నెల 19వ తేదీన ఇంటి బయట పడుకుంటానని భార్య నాగమణికి చెప్పాడు. ఉదయం చూసేసరికి సమీపంలోని ఓ పాకలో ఉరివేసుకుని ఉండడాన్ని గమనించి స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి అన్న కుమారుడు చెల్లు వెంకటదుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

బాణసంచా పేలుడు ఘటనలో మహిళ మృతి

అమలాపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలోని రావులచెరువులో ఇటీవల జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడిన గొవ్వాల సుబ్బలక్ష్మి (60) కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందింది. సుబ్బలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పేలుడు ఘటనలో గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మిగిలిన క్షతగాత్రులను ఎంపీ గంటి హరీష్‌మాధుర్ శుక్రవారం పరామర్శించారు. బాధితులకు మరింత మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే చినరాజప్ప, జాతీయ స్థాయి క్రీడాకారుడు రాంబాబును సత్కరిస్తున్న చినరాజప్ప, విజయ్‌ప్రకాష్, రాజా సూరిబాబురాజు

క్రీడా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

- పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప
- శ్రీప్రకాష్‌లో ప్రారంభమైన సీబీఎస్ఈ క్లస్టర్-7 టీటీ పోటీలు
- 350 మంది క్రీడాకారుల హాజరు

పెద్దాపురం, సెప్టెంబరు 20: విద్యార్థులు అత్యుత్తమ క్రీడా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. కాకినాడ జిల్లా పెద్దాపురం రామారావుపేటలోని శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగే సీబీఎస్ఈ క్లస్టర్-7 టేబుల్ టెన్నిస్ పోటీలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. భవిష్యత్తులో ఒలింపిక్ క్రీడలకు ఈ అకాడమీ ద్వారా మంచి నైపుణ్యం కలిగిన క్రీడాకారులు తయారు కావాలని ఆకాంక్షించారు. అత్యాధునిక సదుపాయాలతో అన్ని హంగులతో పూర్తిస్థాయి అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన టేబుల్ టెన్నిస్ అకాడమీలో క్రీడాకారులు సత్తా చాటాలన్నారు. ఇటువంటి క్రీడలకు శ్రీప్రకాష్ వేదిక కావడం సంతోషదాయకమన్నారు.. ఏపీ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి పి.విశ్వనాథ్ మాట్లాడుతూ అత్యాధునిక హంగులతో ఇటువంటి టేబుల్ టెన్నిస్ అకాడమీ ఇక్కడ రూపుదిద్దుకోవడం గర్వకారణమన్నారు. పాఠశాల డైరెక్టర్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు తమ పాఠశాల వేదిక కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ పోటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 350 క్రీడాకారులు హాజరుకానున్నట్టు చెప్పారు. అనంతరం పదకొండుసార్లు బాల్ బ్యాడ్మింటన్‌లో జాతీయ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారుడు కుమిలి రాంబాబును ఘనంగా సత్కరించారు. పోటీలకు రిఫరీలుగా రమణకుమార్, వేణు వ్యవహరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు పాల్గొన్నారు.

సొమ్మొకరిది... సోకొకరిది...

- అధికారుల వినోదం కోసం ఐటీడీఏ నిధులతో ఇండోర్ స్టేడియం నిర్మాణం
- గిరిజన ప్రయోజనాలను విస్మరించి రూ.10 లక్షల నిధుల దుర్వినియోగం





రంపచోడవరంలో గోదామును ఇండోర్ స్టేడియంగా మార్చిన దృశ్యం

రంపచోడవరం, సెప్టెంబరు 20: గిరిజనుల అభివృద్ధికి మాత్రమే వినియోగించాల్సిన రంపచోడవరం ఐటీడీఏ నిధులను జగన్ పాలనలో ఉన్నతాధికారులు తమ వినోదం కోసం దుర్వినియోగం చేశారు.

రంపచోడవరంలో షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ కోర్టును ఐటీడీఏ నిధులతో ఇక్కడి ఉన్నతాధికారులు ఏర్పాటు చేసుకున్నారు. ఎటువంటి అనుమతి, ఆమోదం లేకుండానే... ముఖ్యంగా ఐటీడీఏ పాలకవర్గ తీర్మానం కూడా లేకుండా ఈ ఇండోర్ కోర్టుకు సుమారు రూ.10లక్షలు వెచ్చించినట్టు తెలిసింది. ఐటీడీఏ, రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖల ఉన్నతాధికారుల వినోదం కోసమే దీనిని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు తీర్చిదిద్దారు. ఆ అధికారులు ఇక్కడ రిలాక్స్ అవడం కోసం దీనిని ఏర్పాటు చేసుకున్నారన్న విమర్శలున్నాయి. రంపచోడవరంలో ఐటీడీఏ ఆధీనంలోని గోదామును ఉన్నతాధికారుల ఆనందం కోసం గిరిజన సంక్షేమ ఇంజనీర్లు ఇండోర్ షటిల్ కోర్టుగా మార్చారు. గిరిజనులకు ఉపయోగించాల్సిన నిధుల నుంచి రూ.10లక్షలను ఇందుకు వాడడం వివాదాస్పదమైంది. ఉన్నతాధికారులు రాత్రివేళల్లో ఈ ఇండోర్ స్టేడియాన్ని వినియోగించుకుంటున్నారు. మిగిలిన సమయాల్లో కమర్షియల్ స్టేడియంగా నెలకు రూ.4వేలు వసూలు చేసే వ్యవస్థగా మార్చి కొందరు ఉద్యోగులు, ప్రముఖులను కూడా చేర్చుకున్నారు. ఉన్నతాధికారులు అక్కడ ఉన్న సమయాల్లో సెక్యూరిటీ కారణాలతో ఎవర్నీ అటువైపుగా రానిచ్చేవారు కాదు. అందుకు వారు పహారా కూడా ఏర్పాటు చేసుకునేవారన్న విమర్శలూ ఉన్నాయి.



జైలులో పండించిన కూరగాయలు, మహిళా ఖైదీలు తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న వెంకటలక్ష్మి

ఆశ్రమాన్ని తలపిస్తున్న మహిళా జైలు

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి కితాబు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మహిళా ప్రత్యేక కారాగారం ఆశ్రమాన్ని తలపిస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి కితాబిచ్చారు. శుక్రవారం ఆమె జైలును పూర్తిగా పరిశీలించారు. బ్యారక్‌లు, వంటశాల, బేకరీ, పాఠశాల, గ్రంథాలయంతో పాటు ఆరు బయట జైలును సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలు ఆరా తీశారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. మహిళా ఖైదీలు తయారు చేస్తున్న బ్రెడ్, బిస్కట్లు, ఇతర ఆహార పదార్థాలను రుచి చూసి ప్రశంసించారు. జైలు ఆవరణలో మొక్కలు నాటారు. స్త్రీ సంబంధిత వ్యాధులు, పిల్లల వైద్య నిపుణులను రప్పించి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో అర్జీలు స్వీకరించారు. మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఐసీడీఎస్ పీడీ విజయకుమారి, జైలు పర్యవేక్షణాధికారి వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో గైనిక్ సంబంధిత ఆంకాలజీ స్క్రీనింగ్ పరీక్షలు

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 20: మహిళల్లో గర్భసంచి ముఖద్వార క్యాన్సర్‌కి సంబంధించి కాకినాడ జీజీహెచ్ గైనిక్ విభాగంలో ఈ నెల 23 నుంచి 26 వరకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్టు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్, ఆంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసన్ ఆధ్వర్యంలో గైనకాలజీ ఓపీడీ, ఎస్ఆర్ఎంటీ విభాగంలో క్యాంప్ నిర్వహిస్తారన్నారు. 35ఏళ్ల వయసు దాటిన మహిళలంతా ఈ పరీక్షల్లో పాల్గొనవచ్చన్నారు. దేశ, విదేశాల నుంచి ఆంకాలజీ వైద్య నిపుణులు రానున్నారని వెల్లడించారు. ఈ స్క్రీనింగ్ పరీక్షల్లో పాల్గొనదలచిన మహిళలు ముందుగా గైనిక్ విభాగానికి వచ్చి తమ పేరు, ఫోన్ నెంబరు తెలియపర్చాలన్నారు. అనంతరం నాలుగు రోజుల క్యాంప్‌లో ఎవరెవరికి ఏ సమయం కేటాయించాలనేది నిర్ణయించి తెలియపరుస్తామన్నారు. వారంలో రెండు రోజుల పాటు రొమ్ము, గర్భసంచి ముఖద్వార క్యాన్సర్, నోటి క్యాన్సర్‌లకు స్క్రీనింగ్ నిర్వహించనున్నట్టు ఆంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసన్ తెలిపారు.



నూతన యూనిట్ ప్రారంభం సందర్భంగా ఉద్యోగులు, సిబ్బంది

గ్రామీణ ప్రాంతాల్లో

ఉపాధి కల్పన దిశగా పయనం

- దేవీ ఫిషరీస్ ఎండీ యార్లగడ్డ వీర్రాజు
- నూతన రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం

కాకినాడ సిటీ/జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 20: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన దిశగా తాము చేస్తున్న ప్రయత్నాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించడం వల్ల మంచి ఫలితాలు సాధించగలుగుతున్నామని దేవీ ఫిషరీస్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ యార్లగడ్డ వీర్రాజు అన్నారు. కాకినాడలోని కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగ్గంపేట మండలం సీతానగరంలో నూతనంగా నెలకొల్పిన రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌ను గురువారం ఢిల్లీలో జరిగిన వరల్డ్ ఫుడ్ ఇండియా-2024 ఫెస్టివల్ వేదికగా కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, ప్రహ్లాద్ జోషి, రవ్‌నీత్‌సింగ్ బిట్టు వర్చువల్‌గా ప్రారంభించారని తెలిపారు. ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా 2వేల మందికి, పరోక్షంగా వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో యూనిట్లు నెలకొల్పుతున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శేషుమాధవ్

పొగాకు రైతులు అవగాహనతో

అధిక దిగుబడులు సాధించాలి

సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 20: పొగాకు రైతులు పూర్తి అవగాహనతో అధిక దిగుబడులు సాధించవచ్చని సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని హోటల్ మంజీరాలో శుక్రవారం సీటీఆర్ఐ శాస్త్రవేత్తలతో ఫెర్టిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పొగాకు రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన శేషుమాధవ్ పొగాకు పంటలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను క్లుప్తంగా వివరించారు. రైతులు పూర్తిస్థాయిలో అవగాహనతో అధునాతన పద్ధతుల్లో పొగాకు పంట వేసుకోవాలన్నారు. రైతుల అనుమానాలను ఆయన నివృత్తి చేశారు. సీనియర్ శాస్త్రవేత్త పూర్ణబిందు పొగాకు పంటలో ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. 15 నుంచి 20శాతం అధిక దిగుబడి సాధించడానికి ఫెర్టిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ టాక్ నూర్ గ్రాన్యూల్ ఎయిర్ షీల్డ్, కస్టమైజ్డ్ ఫెర్టిలైజర్స్ వాడాలన్నారు. సదస్సులో ఫెర్టిస్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ కేవీ గోపాల్‌రాజు, గోపాల్‌రెడ్డి, జయబాల, ఆర్.కృష్ణకుమార్, శరత్‌బాబు, బాజీ హుస్సేన్, అవినాష్ తేజ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు తిట్టారని

అలిగి రైలెక్కిన బాలికలు

నిడదవోలులో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన రైల్వే హెడ్ కానిస్టేబుల్



నిడదవోలు, సెప్టెంబరు 20: ఇంట్లో తల్లిదండ్రులు తిట్టారని అలిగిన సుమారు 10 సంవత్సరాల వయసు గల ఇద్దరు బాలికలు ట్రైన్ ఎక్కి నిడదవోలు చేరుకున్నారు. వారిద్దరూ గురువారం సాయంత్రం నిడదవోలు రైల్వే స్టేషన్‌లో తిరుగుతుండగా రైల్వే హెడ్ కానిస్టేబుల్‌కు అనుమానం వచ్చి ఆరా తీశారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో చోటు చేసు కున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి... తల్లిదండ్రులు మందలించారనే కోపంతో అనపర్తికి చెందిన రాచూరి మేరి, మాణిక్యాల గోదగులమ్మ గురువారం రైలు ఎక్కి నిడదవోలు చేరుకున్నారు. ప్లాట్ ఫామ్‌పై సంచరిస్తున్న వారి వివరాలను విధి నిర్వహణలో ఉన్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు తెలుసుకుని అనపర్తి పోలీసులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం బాలికల తల్లిదండ్రులు నిడదవోలు రైల్వే పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి బాలికలిద్దరినీ తల్లిదండ్రులకు అప్పగించారు.

డిగ్రీ మూడో సెమిస్టర్ పాఠ్యాంశంగా

'ఈ పొలం అమ్మబడును'

యానాం రచయిత పెనుమాక రత్నాకర్ కథకి దక్కిన గౌరవం



యానాం, సెప్టెంబరు 20: యానాంకు చెందిన ప్రముఖ రచయిత రత్నాకర్ పెనుమాక రచించిన కథను ఈ విద్యా సంవత్సరం నుంచి ఆంధ్రప్రదేశ్ డిగ్రీ మూడో సెమిస్టర్ పాఠ్యాంశంగా ఎంపిక చేశారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరులో పెనుమాక విజయకుమార్-మేరీరోజ్ హైమావతి దంపతులకు జన్మించిన రత్నాకర్ యానాంలో స్వచ్ఛంద సేవా సంస్థ నెలకొల్పి 2005 నుంచీ సామాజిక సేవ చేస్తున్నారు. ఇప్పటివరకు 60 కథలు, 5 నవలు, 30 కవితలు రాశారు. 2022లో 'గౌతమి తీరం' పేరుతో మొదటి సంపుటి ఆవిష్కరించారు. ఇప్పటి వరకు 24 కథా బహుమతులు పొందారు. ఈ మధ్య 'ఉష' పత్రిక నిర్వహించిన ప్రపంచ స్థాయి కథల పోటీల్లో ప్రథమ బహుమతి పొందారు. ఆ కథపై అన్ని సాహిత్య వేదికల్లో చర్చ జరిగింది. కథా సాహిత్యంలో నిలిచిపోయే కథగా ప్రశంసలందుకుంది. సహరి పత్రికలో ప్రథమ బహుమతి పొందిన 'ఈ పొలం అమ్మబడును' అనే కథను డిగ్రీ మూడో సెమిస్టర్లో పాఠ్యాంశంగా ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఇప్పటివరకు డిగ్రీ మొదటి, రెండు సెమిస్టర్ వారికి మాత్రమే రెండో భాష సబ్జెక్టుగా ఉండేది. ఈ విద్యా సంవత్సరం నుంచి మూడవ సెమిస్టర్ వారికి తెలుగు భాషను రెండో భాషా సబ్జెక్టుగా ప్రారంభిస్తున్నారు. అందులో కథా సాహిత్యంగా రాచకొండ విశ్వనాథశాస్త్రి లాంటి లబ్ధ ప్రతిష్ఠులైన కథలతో పాటు రత్నాకర్ కథను కూడా ఎంపిక చేశారు. ఇది ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని డిగ్రీ కళాశాలల్లో అమలు కానుందని, ఇందుకు ప్రభుత్వం ఉత్తర్వు ఇచ్చినట్టు రత్నాకర్ తెలిపారు. ఇప్పటివరకు జీవించి ఉన్న ఏ కథకుడు (దళిత వర్గానికి చెందిన) కథను ఎంపిక చేయలేదు. ఇంతకు ముందు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి కొలకలూరి ఇనాక్‌కు చెందిన 'ఆకలి కథ' పాఠ్యాంశంగా ఉందని.. ఇప్పుడు డిగ్రీ స్థాయిలో ఇదే ప్రథమమని తెలుస్తోంది. ఇది యానాం దళితవర్గానికి దక్కిన అరుదైన గౌరవమని పలువురు ప్రముఖులు ప్రశంసించారు. ఈ ఘనత సాధించిన రత్నాకర్‌కు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, 'కళైమామణి' పొనుగుమట్ల విష్ణుమూర్తి, ప్రముఖ రచయిత 'కళైమామణి' దాట్ల దేవదానంరాజు అభినందనలు తెలిపారు..

భక్తిశ్రద్ధలతో ఉండ్రాళ్ల తద్ది

ముమ్మిడివరం, సెప్టెంబరు 20: మండలంలో భక్తి శ్రద్ధలతో ఉండ్రాళ్లతద్దిని జరుపుకున్నారు. మహిళలు ఉండ్రాళ్లతద్దిని ఎంతో ప్రత్యేకంగా భావిస్తారు. కొత్తగా పెళ్లయిన యువతులు గౌరీపూజ చేసిన ఉండ్రాళ్లకథ చదువుతారు. పెళ్లి కాని యువతులు ఈనోము నోచుకుంటే కళ్యాణయోగం కలిగుతుంది బాద్రపథ బహుళ తదియ నాడు ఉండ్రాళ్లతద్ది చేసుకుంటారు. తద్దిరోజున తెల్లవారుజామున స్నానాలు ఆచరించి గోంగూర లేదా ఆవకాయ పెరుగన్నం తీసుకుని రోజంతా ఉపవాసం చేసి సాయంత్రం పవిత్ర జలాలలో గౌరీదేవికి పూజలు నిర్వహిస్తారు.

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ ధ్యేయం

- ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో నాయకులు
- వంద రోజుల పాలనపై కరపత్రాల పంపిణీ



లంకల గన్నవరంలో కరపత్రాలను అందిస్తున్న రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు

అయినవిల్లి, సెప్టెంబరు 20: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం నేదునూరులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం సర్పంచ్ గుమ్మడి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. 100 రోజుల్లో ప్రభుత్వం ఉమ్మడి మ్యానిఫెస్టోలు తెలిపిన విధంగా పెన్షన్లు రూ.4వేలకు పెంపు, మెగా డీఎస్సీ, గ్రామీణ అభివృద్ధికి పంచాయతీకి నిధులు, అన్నక్యాంటీన్ల ద్వారా పేదలకు రూ.5లకే భోజనం, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేశామన్నారు. ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణలను స్థానికులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తాడి వెంకటాచార్య మండల ప్రత్యేకాధికారి శివశంకరప్రసాద్, తహసీల్దారు నాగలక్ష్మమ్మ, నామన రాంబాబు, మద్దాల సుబ్బారావు, నేదునూరి వీర్రాజు, మోర్త వెంకటేశ్వరరావు, సలాది పుల్లయ్యనాయుడు, సయ్యపురాజు సత్యనారాయణరాజు, వర్రే శ్రీను, చిట్టూరి శ్రీనివాస్, ఇందుగుల వెంకట్రామయ్య పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం

రాయవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం రాయవరం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ సీనియర్ నేత ఉండవిల్లి రాంబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చైతన్యకుమారి, కూటమినేతలు మలిపూడి చిన్న, ఉండవిల్లి శ్రీనివాస్, కేతా శ్రీను, చిన్ని, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి పాల్గొన్నారు.

పి.గన్నవరం: కూటమి ప్రభుత్వం గడచిన 100 రోజుల్లో ప్రజారంజక పాలన అందించిందని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు అన్నారు. లంకల గన్నవరంలో ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను స్థానిక కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సత్తిబాబు, మాజీ సర్పంచ్ కొపనాతి సీతారామస్వామి, లంకే భీమరాజు, వేమన రామకృష్ణ, లంకే సుబ్బారాయుడు, కామాడి రామకృష్ణ, వేమన గంగాధరరావు, పెదపూడి దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్రేయపురం: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తికావడంతో సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాల కరపత్రాలను అందించి గోడకు స్టిక్కర్లను అంటించారు. ఎంపీడీవో నాతి బుజ్జి, తహసీల్దారు రాజేశ్వరరావు, వివిధశాఖల మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బందితో వెళ్లి ఇంటింటికి ప్రభుత్వం అందించిన పథకాలను వివరించారు. సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని గాడిలో పెట్టిన ఘనత కూటమిదే : ఎమ్మెల్యే బుచ్చిబాబు

ముమ్మిడివరం: వైసీపీ ఐదేళ్ల పాలనలో అదోగతి పాలుచేసిన రాష్ట్రాన్ని వందరోజులలో గాడిలోపెట్టిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టి వందలరోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ముమ్మిడివరం మండలం సీహెచ్.గున్నేపల్లి గ్రామంలో కూటమి నాయకులతో కలసి కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. గ్రామంలో మొక్కలు నాటి వందరోజుల పాలనలో చంద్రబాబు అందించిన సంక్షేమం, అభివృద్ధిపై ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్ గొలకోటి దొరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు గుత్తుల సాయి, చెల్లి అశోక్, సబతి పనేశ్వరరావు, అద్దాన్ని శ్రీనివాసరావు, యాళ్ల ఉదయ్, నడిమిటి సూర్యప్రభాకరం, కొప్పిశెట్టి శ్రీనివాస్, వాసంశెట్టి అమ్మాజీ, కూడిపూడి మల్లేశ్వరీ, దూడల స్వామినాయుడు, పంచాయతీ కార్యదర్శి రాజశ్రీ పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం : ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: రాష్ట్రంలో వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని ఇపుడు రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు మేలు చేస్తున్నాయని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండలంలోని మారేడుబాకలో శుక్రవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో సర్పంచ్ గోవిందరాజు అధ్యక్షతన జరిగిన గ్రామసభకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వంద రోజులు కూటమి ప్రభుత్వ పాలన ప్రజలకు మెరుగైన పాలన అందించిందని వేగుళ్ల అన్నారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, ఎంపీడీవో సత్యన్నారాయణ, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరావు, తహసీల్దార్ తేజేశ్వరరావు, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన: ఎమ్మెల్యే ఆనందరావు

ఉప్పలగుప్తం: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో సుపరిపాలన అందించినట్టు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఉప్పలగుప్తం పంచాయతీ పేరాయిచెరువులో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వంద రోజుల ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వంద రోజుల పాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చిక్కం కాసు, మధుర నరసింహమూర్తి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, గ్రామ సర్పంచ్ కడిమి చిన్నవరాజు, కూటమి నాయకులు రవణం మధు, పెయ్యల దుర్గారావు, ఆకుల సూర్యనారాయణమూర్తి, చిక్కం ఉమేష్, గాలిదేవర సురేష్, ఆకేటి పెద్ద, చిక్కం సూర్యమోహన్, సలాది శ్రీనివాసరావు, దెందుకూరి సత్తిబాబురాజు, ఆల్లాడ స్వామినాయుడు, నల్లా బాబండి, కంకటాల రామం, మధుర ప్రతాప్, దోనిపాటి అశోక్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు న్యాయం

అంబాజీపేట: కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని సర్పంచ్ అక్కిశెట్టి నాగమణి పెద్ద అన్నారు. ఇరుసుమండలో ప్రత్యేకాధికారి, తహసీల్దారు జె.వెంకటేశ్వరి అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి 100రోజుల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. పంచాయతీ కార్యదర్శి ఆర్.ఏడుకొండలుం టి, అక్కిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం కరపత్రాల పంపిణీ

అల్లవరం: 100 రోజుల టీడీపీ కూటమి పాలనపై ప్రభుత్వం చేపట్టిన మంచి ప్రభుత్వం కార్యక్రమాల కరపత్రాలను గోడి, గోడిలంక గ్రామాల్లో పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, వేగిరాజు సుబ్బరాజు(శ్రీనురాజు), ఆర్.నాగరాజు, సర్పంచ్ తోట శ్రీదేవి, ఎంపీటీసీ కాండ్రేగుల వాణిఅచ్యుతం, కార్యదర్శి కంకిపాటి సత్యనారాయణ, తోట నరసింహారావు, గాలిదేవర శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంచి ప్రభుత్వంతో మంచి రోజులు వచ్చాయి

అంతర్వేది: సఖినేటిపల్లి మండలం మోరి గ్రా మంలో ప్రజావేదికలో భాగంగా రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శుక్రవారం 100 రోజుల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా కూటమి ప్రభుత్వంతో మంచిరోజుల వచ్చాయన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో రూ.10కోట్లతో సీసీరోడ్ల ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముప్పర్తి అలివేలుగంగత్రివేణి, ప్రత్యేకాధికారి డి.రాంబాబు, ఎంపీడీవో సత్యనారాయణ, పెదకాపు, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, మల్లిపూడి సత్తిబాబు, గెద్దం మహాలక్ష్మీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే బండారు

రావులపాలెం: సంక్షేమం,అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం మండలం గోపాలపురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమ గ్రామసభ నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు. ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ 100 రోజుల్లోనే ప్రజల మన్ననలను పొందిన ప్రజాప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు. అనంతరం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికించారు. గుత్తుల పట్టాభిరామారావు, తోట స్వామి, చిలూవురి సతీష్‌రాజు, సబ్బిత మోహనరావు, అధికారి నాగు, మైగాపుల గురవయ్యనాయుడు, పాలూరి సత్యానందం, కాసా సాగర్, కేతా శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మొక్కలను నాటారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

మండల స్థాయి క్రీడా పోటీలు



కపిలేశ్వరపురంలో కబడ్డీ పోటీల్లో విద్యార్థినులు

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 20: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శుక్రవారం మండలస్థాయి బాలికల క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలానికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ ఆటల పోటీలను పాఠశాల హెచ్ఎం వంగా శ్రీనివాస్ ప్రారంభించారు. అండర్-17 బాలుర ఖోఖో పోటీల్లో కపిలేశ్వరపురం విద్యార్థులు విన్నర్‌గాను, నల్లూరు విద్యార్థులు రన్నర్‌గాను నిలిచినట్లు పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, మండల పీడీ గుబ్బల వేణుగోపాల్‌రావు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు ముత్తా సత్యనారాయణ, మేకా సత్యనారాయణ, దుర్గాప్రసాద్, బేగం, రవికుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొమరగిరిపట్నం హైస్కూల్‌లో..

అల్లవరం: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని జడ్పీటీసీ కొనుకు గౌతమి అన్నారు. అల్లవరం మండలం కొమరగిరిపట్నం జడ్పీ హైస్కూల్‌లో 68వ మండలస్థాయి క్రీడా పోటీలను జడ్పీటీసీ గౌతమి, సర్పంచ్‌లు రాకాపు విజయలక్ష్మి, వడ్డి సుభాషిణి ప్రారంభించారు. ముందుగా క్రీడా పతాకాన్ని ఎగురవేశారు. అండర్-17, 14 విభాగాలలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడాకారుల ఎంపిక పోటీలు జరిగాయి. ఓడలరేవు, దేవగుప్తం, గోడిలంక, బోడసకుర్రు, కోడూరుపాడు, అల్లవరం, గోడి గురుకుల, హర్షవిజ్ఞాన భారతి స్కూల్‌లో పాటు తొమ్మిది హైస్కూల్ విద్యార్థులు ఆటల పోటీల్లో తలపడ్డారు. హెచ్ఎం జీఎస్వీ రమణ, ఎస్ఎంసీ చైర్మన్ సుంకర వాసు, ఎంఈవోలు కిరణ్‌బాబు, ఏడుకొండలు, ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, ఎం.శ్రీని వాస్, పి.రాజేశ్వరి, పీఈటీలు యుఎస్వీ ముసలయ్య, కె.ఈశ్వరరావు, ఏ.దుర్గాప్రసాద్, కె.వెంకటేశ్వరరావు, బొంతు ప్రసాద్, కె.త్రిమూర్తులు, ఎం.రమేష్ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్లో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలికలకు అండర్-14, అండర్-17 విభాగాల్లో మండల స్థాయి ఆటల పోటీలు, నియోజకవర్గ స్థాయి ఎంపికలు నిర్వహించారు. వ్యాయామోపాధ్యాయులు గొలకోటి ఫణీంద్రకుమార్, కామన మధు, పి.విఘ్నేశ్వరుడు, డి.సరస్వతి, ఐశ్వర్య, కరాటం ప్రసాద్ పోటీలను పర్యవేక్షించారు. హెచ్ఎం లంక రాణి ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పీఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణ, జడ్పీటీసీ గెద్దం సంపదరావు, సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గాచిన్నా, గుత్తాల సుభాష్ చంద్రరావు, పిల్లా బుజ్జి, అరిగెల నరేష్, మంచెం బాలకృష్ణ, గొలకోటి దొరబాబు, చప్పిడి వెంకటనాగేశ్వరరావు, నల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

'గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలి'



వాడపాలెంలో చెత్తను పారిశుధ్య కార్మికురాలుకి అందిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు, శ్రీనివాస్

కొత్తపేట, సెప్టెంబరు 20: నియోజకవర్గంలో ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీలు చర్యలు తీసుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా వాడపాలెంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించడంతో పాటు పారిశుధ్య కార్మికులతో కలిసి శ్రమదానం చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, సర్పంచ్ త్సామా బాబు, బండారు బులితాత, పప్పుల కొత్తయ్య, బండారు వీరబాబు, చీకట్ల అబ్బు, బండారు అబ్బులు, ఎంపీడీవో మహేష్, కార్యదర్శి రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి

అంతర్వేది, సెప్టెంబరు 20: సఖినేటిపల్లి మండలంలో పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టినట్లు ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. గొంది గ్రామపంచాయతీ పరిధిలో కార్యదర్శి గంగరాజు, సర్పంచ్ రవికుమార్ అధ్యక్షతన పారిశుధ్య పనులను శరవేగంగా చేసి చెత్తను డంపింగ్ యార్డులకు తరలించినట్లు తెలిపారు. మండలంలో స్వచ్ఛతహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

నర్సిపూడిలో వైద్య శిబిరం

ఆలమూరు, సెప్టెంబరు 20: ఆలమూరు మండలం నర్సిపూడిలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రాయుడు సతీష్, రాయుడు బాబ్జి అధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో రామ డెంటల్ కేర్, ఆదర్శ హాస్పటల్స్, డా.మోహన్ డైబిటీస్ సెంటర్, గౌతమి నేత్రాలయం తదితర ఆసుపత్రుల డాక్టర్స్ వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ వైద్య శిబిరంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో దునే స్వామినాయుడు, సలాది నాగేశ్వరరావు, కందిబొట్ల రాంబాబు, చలపతి వెంకటరమణ, లంక వెంకటరమణ పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్
శ్రీలలిత	ఉత్సాహం
శేఖర్ స్క్రీన్-1	కళింగ
శేఖర్ స్క్రీన్-2	ఆయ్
రమా	మత్తువదలరా-2
గణపతి	కమిటీ కుర్రోళ్లు
వెంకటపద్మావతిస్క్రీన్-1	సరిపోదా శనివారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	గొర్రె పురాణం

సర్జికల్ కిట్లు, బెడ్ షీట్లు పంపిణీ

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 20 : మండల కేంద్రమైన కపిలేశ్వరపురం సీహెచ్‌సీకి జనసేన ఆధ్వర్యంలో శుక్రవారం సర్జికల్ కిట్లు, బెడ్‌షీట్లు, మాస్కులు పంపిణీ చేశారు. అంగర గ్రామానికి చెందిన జనసేనపార్టీ గ్రామ ఉపాధ్యక్షుడు తోరాటి శ్రీనివాస్ సౌజన్యంతో వీటిని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రాకేష్‌చౌదరికి అందజేసినట్లు తెలిపారు. పిల్లా బసవరాజు, దానేటి శరత్, ఆలపాటి నారాయణమూర్తి, సుధాతేజ పాల్గొన్నారు.

యానాంలో స్వచ్ఛతా హీ సేవా

యానాం, సెప్టెంబరు 20: యానాం నియోజకవర్గంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యానాం మున్సిపాలిటీ, పుదువై భారతీయర్ గ్రామ బ్యాంక్ సంయుక్త నిర్వహణలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ పార్కులో ఈ కార్యక్రమాన్ని పరిపాలనాధికారి మునిస్వామి, బ్యాంక్ చైర్మన్ రత్నవేల్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు చిత్రలేఖ పోటీలను ప్రారంభించారు. స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో జరిగిన ముఖ్యఅతిథులుగా మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, జేఈ జి.లక్ష్మీ పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి సంబంధించి విద్యార్థులు వివిధ అంశాలపై చిత్రాలు గీశారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

అంబాజీపేట, సెప్టెంబరు 20: గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలోని సామాజిక భవనంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.వెర్నమ్మ, వీఎస్వీ మహాలక్ష్మిల ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి ట్రేడర్స్ అధినేత షైపాల తాతాజీ-పద్మావతి దంపతులు సమకూర్చిన పసుపు, కుంకుమ, స్వీట్లు, పూలు, సీమంతం కిట్లను 10 మంది గర్భిణీలకు అందించారు. కార్యక్రమంలో తహసీల్దారు జె.వెంకటేశ్వరి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, వైస్ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీటీసీలు మట్టా పార్వతి, ముత్తాబత్తుల ప్రశాంత్, ఆర్ఐ ఇబ్రహీం, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌లో ఉచిత భోజనం

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 20 :రామచంద్రపురం అన్నక్యాంటీన్‌లో శుక్రవారం ఉపాధ్యాయుడు తనకుమారుడు పుట్టిన రోజు సందర్భంగా ఉచిత భోజనం అందజేశారు. స్థానిక చింతపల్లి సూరన్ననగర్ ఇందిరా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కట్టా శ్రీనివాసరావు తన కుమారుడు కట్టా శ్రీరామ్ జన్మదినం పురస్కరించుకుని 500 మందికి ఉచిత భోజనం సమకూర్చారు. ఇందుకుగాను ఆయన రూ.2500 అన్నక్యాంటీన్‌కు చెల్లించి వచ్చినవారికి ఉచిత భోజనం అందజేశారు.

స్వర్ణకార సంఘ అధ్యక్షుడిగా వెదురుపర్తి

మండపేట, సెప్టెంబరు 20: మండపేట పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా వెదురుపర్తి రామకృష్ణప్రసాద్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం సభ్యులంతా శుక్రవారం ఎమ్మెల్యే వేగుళ్లజోగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్‌లను కలిశారు. స్వర్ణకార సంఘాభివృద్ధికి తమ వంతు సహకారం అందజేస్తామని వారు హామీ ఇచ్చారు.

'జీవో 117ను రద్దు చేయాలి'

మామిడికుదురు, సెప్టెంబరు 20: ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసిన జీవో 117ను రద్దు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.సురేష్‌బాబు కోరారు. పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మండలంలో మండలశాఖ అధ్యక్షుడు భీమరాజు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. వివిధ ఉన్నత పాఠశాలలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుంచి విడుదల కాని పాఠశాల గ్రాంట్లను సత్వరమే విడుదల చేయాలని బకాయిపడ్డ ఏపీజీఎల్ఐను, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, 12వ పీఆర్సీలో భాగంగా 20 శాతం ఐఆర్‌ను మంజూరు చేయాలని నూతన డీఎస్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ ప్రదీప్‌కుమార్, కె.చంద్రశేఖర్, సీహెచ్.రమేష్, కేవీడీ ప్రసాద్, సీహెచ్ వెంకటేశ్వరరావు, సాయిబాబు పాల్గొన్నారు.

85 జీవోను రద్దు చేయాలి

ముమ్మిడివరం: ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన జీవో నెం.85ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యులు సమ్మెను చేపట్టారు. వారంతా శుక్రవారం ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కాలేజీ నుంచి డీఎంఅండ్ హెచ్‌వో కార్యాలయానికి తరలివచ్చి నిరసన తెలిపారు. అనంతరం డీఎంఅండ్ హెచ్‌వో దుర్గారావుదొరకు వినతి పత్రం అందించారు. పీహెచ్‌సీ వైద్యులంతా చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించిన తరువాత వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌తో జరిపిన చర్చలలో భాగం గా ఐదు ప్రధాన డిమాండ్లపై ఇంతవరకు స్పష్టత ఇవ్వని కారణంగా సమ్మెను కొనసాగిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు రాకేష్, మణికుమార్, ఇందిరలతోపాటు జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యులంతా పాల్గొన్నారు.

జిల్లాలో 44.02 లక్షల పనిదినాలు పూర్తి : డ్వామా పీడీ

అంబాజీపేట, సెప్టెంబరు 20: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా 2024-25కి సంబంధించి జిల్లాలో 57లక్షల పనిదినాలు లక్ష్యంగా ఇప్పటివరకు 44.02లక్షల పనులు పూర్తిచేసినట్లు జిల్లా డ్వామా పీడీ ఎస్.మధుసూధనరావు అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జీవీ సరోవర్ అధ్యక్షతన 16వ ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక సభను శుక్రవారం నిర్వహించారు. జిల్లాలో నిర్వహించే పనుల నిమిత్తం ఏడాది రూ.156 కోట్లు వేతనాలుగా నిర్ణయించగా ఇప్పటివరకు రూ.130కోట్లు వేతనాలు ఉపాధి కూలీలకు ఆయా అకౌంట్లోకి వేశామన్నారు. జిల్లాలో 100 రోజులు పనిచేసిన వారు 2285 మంది ఉన్నారన్నారు. 562మంది కుటుంబాలు 100రోజులు పనిచేసిన మండలం మల్కిపురం మండల జిల్లాలో మొదటి స్థానంలో ఉండగా, కేవలం 11 కుటుంబాలు మాత్రమే 100రోజులు పనులుచేసి అమలాపురం ఆఖరి స్థానంలో ఉందన్నారు. అంబాజీపేట మండలానికి సంబంధించి శుక్రవారం నిర్వహించిన సామాజిక తనిఖీ వేదికలో తనిఖీ సిబ్బంది వివరాలను వెల్లడించారు. ఎస్ఆర్పీ ఎస్.మాధవ్ ఆధ్వర్యంలో డీఆర్పీలు ఆయా గ్రామాల్లో చేపట్టిన తనిఖీ వివరాలను సమావేశంలో వెల్లడించారు. 774 పనులు చేపట్టగా మెటీరియల్ వర్కులు 19, గోకులం శాల ఒకటి పూర్తిచేశామన్నారు. కూలీలకు వేతనాల రూపంలో 7.49కోట్లు చెల్లించామన్నారు. సోషల్ ఆడిట్‌లో రూ.7,400 ఆయా గ్రామాల ఫీల్డ్అసిస్టెంట్ల బకాయి పడ్డారని వివరించారు. ఆయా ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి సొమ్మును రికవరీ చేశామన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, వైస్ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీటీసీలు ముత్తాబత్తుల ప్రశాంత్, మట్టా పార్వతీ, జిల్లా విజిలెన్స్ అధికారి కర్రి భీమేశ్వరరావు, అంబుడ్స్‌మెన్ ఏవీ శ్రీనివాస్, ఏపీవో అడపా వెంకటకృష్ణ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సపక్‌తక్రా పోటీలకు ఇసుకపూడి విద్యార్థులు

అంబాజీపేట, సెప్టెంబరు 20: ఇటీవల కాకినాడలో నిర్వహించిన స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో ఇసుకపూడి విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఏఎల్ వరప్రసాద్ తెలిపారు. సపక్‌తక్రా పోటీలలో నామాడి జ్యోత్స్న, కన్నేటి పూర్ణలక్ష్మీప్రసన్నలు ప్రతిభ కనబరచి అక్టోబరులో విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ క్రీడాకారులకు స్థానిక సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు రూ.1500, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్ రూ.1000, మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు రూ.3వేలు, పళ్ళ దుర్గారావులు రూ.500లు ప్రోత్సాహక నగదును విద్యార్థులకు అందించారు. పీడీ బూల చిరంజీవి, విద్యార్థులను పాఠశాల కమిటీ చైర్మన్ పళ్ళ స్వామినాయుడు, ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి : ఎమ్మెల్యేవేగుళ్ల

మండపేట, సెప్టెంబరు 20: కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రజలకు పిలుపు నిచ్చారు. మండపేట పట్టణంలోని కళ్యాణ లేఅవుట్‌లో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కమిషనర్ రంగారావు, రోటరీ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగ భూషణం, కాలనీవాసులతో కలిసి మొక్కలు నాటారు. ఆయనతో పాటు మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ద్వారపూడి పంచాయతీ కార్యదర్శి ఆకుల వెంకటరమణ సారధ్యంలో పంచాయతీ ప్రాంగణంలో మొక్కలు నాటారు.

వరద బాధితుల సహాయార్థం రూ.లక్ష అందజేత

మండపేట, సెప్టెంబరు 20: విజయవాడ వరద బాధితుల సహాయార్థం దాతలు ముందుకువచ్చి తమ మానవత్వం చాటు కోవటం అభినందనీయమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట పట్టణా నికి చెందిన నాయుడు నరసింహమూర్తి శుక్రవారం ఎమ్మెల్యే వేగుళ్లను కలిసి రూ.లక్ష విరాళం చెక్కును అందజేశారు. సీఎం సహాయనిధికి విరాళం అందజేసిన నరసిం హమూర్తిని ఆయన అభినంది ంచారు. కార్యక్రమంలో దుగ్గిరాల సత్యనారాయణ, పెండ్యాల కృష్ణ, డి.సత్యన్నారాయణ, తదితరులు ఉన్నారు.

రుణాల మంజూరుపై మహిళలకు అవగాహన సదస్సు

ఆలమూరు, సెప్టెంబరు 20: ఆలమూరు మండలం మడికిలో శుక్రవారం వివిధ పథకాల ద్వారా రుణాలు పొందే మహిళలకు డీఆర్‌డీఏ అధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డీఆర్‌డీఏ ఆలమూరు మండల ఏపీఎం ధనరాజు, మడికి ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఐ.తనుజా అధ్వర్యంలో స్థానిక పెద్దల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉమెన్ లీడ్ ఎంటర్ ప్రెన్యూవర్స్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న డ్వాక్రా మహిళలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దొండపాటి సుబ్బరాజు, కొత్తపల్లి కృష్ణ, కొత్తపల్లి నగేష్, అడ్డాల సత్యనారాయణరాజు, ఈదల రమేష్, చెల్లుబోయిన శ్రీనివాస్; కర్రి గంగరాజు ముల్యాల రాజేష్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

పి.గన్నవరం, సెప్టెంబరు 20: బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతంగా పూర్తిచేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమ పేర్కొన్నారు. మొండెపులంకలో జరిగిన బీజేపీ నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆరుమిల్లి వీరభద్రరావు, యర్రంశెట్టి సాయిబాబు, పితాని వెంకటేశ్వరరావు, చీకురమిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.1.75లక్షలు

ఆత్రేయపురం, సెప్టెంబరు 20: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,75,228 లభించినట్టు ఉపకమిషనరు భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

'విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి'

అంబాజీపేట, సెప్టెంబరు 20: పదో తరగతి పరీక్షలకు వెళ్లే విద్యార్థులు ఏకాగ్రతతో విద్యను అభ్యసించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని జిల్లా సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బీవీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఈవోల నుంచి తరలించిన షూ సైజు సరిపడని జతలను స్థానిక జడ్పీ హైస్కూల్‌లో భద్రపరుస్తున్నామన్నారు. అనంతరం స్థానిక పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. హెచ్ఎం కడలి సాయిరామ్, టీచర్ వెన్నపు సత్యనారాయణ, సీఆర్పీలు పాల్గొన్నారు.

వికసిత్ ఆంధ్ర 2047 విజన్‌ప్లాన్‌పై పోటీలు

కొత్తపేట, సెప్టెంబరు 20: కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం వికసిత్ ఆంధ్ర 2047 విజన్ ప్లాన్ అంశాలపై పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు మండల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవో ఎం.హరిప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించారు. వానపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పిల్లి లక్ష్మీప్రవన్య వ్యాసరచన పోటీలోను, కొమ్ముల మణికంఠ వక్తృత్వ పోటీలో ప్రథమ స్థానం సాధించాడు. వీరిని జిల్లాస్థాయి పోటీలకు పంపించనున్నట్లు ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిడ్డి సత్యనారాయణ, ఉమాకొప్పిలింగేశ్వరరావు, సంధ్య, సునీత, సురేష్, ఎంఈవో-2 లీలావతి పాల్గొన్నారు.

చెకుముకి ప్రతిభా పరీక్ష పోస్టర్ ఆవిష్కరణ

ద్రాక్షారామ, సెప్టెంబరు 20: చెకుముకి ప్రతిభా పరీక్ష పోస్టర్‌ను ద్రాక్షారామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆవిష్కరించారు. జనవిజ్ఞానవేదిక రామచంద్రపురం మండల కన్వీనర్ రెడ్డి కనక రాజశేఖర్ ఆధ్వర్యంలో జిల్లా సైన్సు అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థులు ఈనెల 25న జరిగే పాఠశాల స్థాయి పరీక్షలు, అక్టోబరు 1న మండలస్థాయి పరీక్షలు, అక్టోబరు 27న జిల్లా స్థాయి పరీక్షలు జరుగుతాయని కన్వీనర్ రెడ్డి కనకరాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం రత్నప్రభావతి, జనవిజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షుడు పసుపులేటి మోహర్ సుజాత, సైన్సు ఉపాధ్యాయులు గుణ్ణం సత్తిబాబు, చల్లా భవానీదేవి పాల్గొన్నారు.

'ఉత్తమ సేవలే గుర్తింపునిస్తాయి'

రాయవరం, సెప్టెంబరు 20: విధి నిర్వహణలో అందించిన ఉత్తమ సేవలే ఎల్లప్పుడూ గుర్తింపునిస్తాయని ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ సమావేశపు హాల్‌లో హౌసింగ్ ఏఈగా పనిచేసి బదిలీపై వెళ్తున్న కొవ్వూరి శ్రీనివాసరెడ్డికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసరెడ్డిని అధికారులు దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఎంఈవోలు ప్రత్తి రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చైతన్యకుమారి, హౌసింగ్ఏఈ జీఎస్‌దాస్, ఏవో డి.శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసులు

రాయవరం, సెప్టెంబరు 20: పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని తనిఖీచేసిన పోలీసులు అక్రమణ రవాణాను గురువారం అడ్డుకుని పశువులను అక్రమ రవాణ చేస్తున్న వాహనాన్ని సీజ్‌చేసి రవాణా చేస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేశారు. శుక్రవారం రాయవరం ఎస్ఐ బుజ్జిబాబు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మాచవరంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయం లో ఒక వ్యాన్‌లో 10 గేదెలు, రెండు దూడలను అక్రమంగా తరిస్తున్నట్లు గుర్తించారు. పశువులను అక్రమంగా రవాణ చేస్తున్న బుంగ సత్తిబాబు, జోన్నకూటి నానిబాబు, వ్యాన్‌డ్రైవర్ కాకడ శివప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. పశువులను గోశాలకు తరలించారు.

మహిళ అదృశ్యం



ముమ్మిడివరం, సెప్టెంబరు 20: ముమ్మిడివరం నగర పంచాయతీ రామచింతపూడికు చెందిన బైవరపు నాగసాయి(56) గురువారం అదృశ్యమైంది. బైవరపు నాగసాయి గురువారం మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని బంధువులు పేర్కొన్నారు. ఆమె ఆచూకీ కోసం ఇంటి ఎదురుగా ఉన్న సీసీ పూటేజ్‌ను పరిశీలించగా అక్కడి నుంచి ఆటో ఎక్కినట్లు తేలినట్లు వివరించారు. ముమ్మిడివరం విష్ణాలయం సీసీ పుటేజ్‌ను పరిశీలించగా అక్కడ ఆటో దిగినట్లు తెలిసిందని ఆ తరువాత ఆమె ఆచూకీ తెలియరాలేదన్నారు. ఆమె ఇంటి నుంచి వెళ్లినప్పుడు సెల్‌ఫోన్, డబ్బులుగాని తీసుకెళ్లలేదని ఆమె ఆచూకీ తెలిసిన వారు 90000 59239, 8790646882 తెలియజేయాలని వారు కోరారు.

శతాధిక వృద్ధురాలు మృతి



ఆత్రేయపురం, సెప్టెంబరు 20: ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు పైడికొండల నారాయణమ్మ(102) శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఈమె ఇప్పటి వరకు ఎవరిమీద ఆధారపడకుండా తన పనులు తనే చేసుకునేది. నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, మనుమలు, మనుమరాండ్లు, ముని మనుమలు ఉన్నారు. ఈమె మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

చెల్లూరులో రాట మంచి పూజలు

రాయవరం, సెప్టెంబరు 20: మండలంలోని చెల్లూరు శ్రీబాల త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయం వద్ద దసరా ఉత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం పందిరి రాట పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు సాయిశర్మ ఆధ్వర్యంలో రాటమంచి పూజలు నిర్వహించిన అనంతరం పందిరి పనులకు శ్రీకారం చుట్టారు. టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు, మాజీ వైఎస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, గుణ్ణం బాబీ, బొంతు సత్యనారాయణ, రిమ్మలపూడి సత్తియ్య చౌదరి, మాజీ సర్పంచ్ నూనె శ్రీదేవి, గొడితి చిన్నా, దేవు రాంబాబు, పంపన సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పందిరిరాట ముహూర్తం

ముమ్మిడివరం, సెప్టెంబరు 20: దేవీ శరనవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని ముమ్మిడివరం హైస్కూల్ సెంటర్‌లో విజయదుర్గాంబికా యువజన వర్తక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పందిరాట ముహూర్తం చేశారు. అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు చేపట్టి 15 వసంతాలు పూర్తి చేసుకుని 16 వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా వేములవరస చిన్నారావు పందిరిరాట ముహూర్తం చేశారు. విత్తనాల వీరవెంకటసత్యనారాయణ, వెలమల్లి వెంకటేశ్వరరావు, వేగిసన సూరపురాజు, గుత్తుల దుర్గావెంకటమణికంఠ, గ్రంధి రామకృష్ణ, పొత్తూరి శ్రీను, మురళీ, కొప్పినీటి వీరన్నబాబు, మట్టపర్తి కృష్ణారావు పాల్గొన్నారు.

తాగునీటి శుద్ధిని పరిశీలించిన చైర్‌పర్సన్

ద్రాక్షారామ, సెప్టెంబరు 20 : రామచంద్రపురం పట్టణానికి తాగునీటిని అందిస్తున్న వెల్లలో తాగునీటి రిజర్వాయర్, శుద్ధి విధానం శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మంత్రి సుభాస్ తండ్రి వాసంశెట్టి సత్యం కౌన్సిలర్లు పరిశీలించారు. కమిషనర్ బి.శ్రీనివాసులు, ఇతర అధికారులతో కలసి తాగునీటిని శుద్ధి చేస్తున్న విధానం పరిశీలించారు.